కంచి పరమాచార్య

శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి

**అమృతవాణి**

**4**

# సనాతనధర్మంలో సంఘసేవ


అనువక్త

దేవరకొండ శేషగిరిరావు



ఎమెస్కో

# విషయ సూచిక


| | |
|---|---|
| సంఘసేవ | **9-84** |
| ఆచారములు | **85-145** |
| ఆహార నియమాలు | **146-198** |

# సంఘసేవ

## పరోపకారం

ఈ ఆధునికకాలంలో అశ్వమేధయాగం చేయడం సాధ్యమేనా?

ఇదేమి ప్రశ్న? స్వామివారు సరిగా మాట్లాడుతున్నారా? అని సందేహం కల్గుతోంది కదా! పూర్వకాలంలో ఏ కొద్దిమంది మహారాజులో దీనిని నిర్వహించేవారు. రాజు పట్టాభిషిక్తుడైన తరువాత నాల్గుమూలలా తిరగడానికి ఒక అశ్వాన్ని విడిచిపెట్టేవారు. ఎవ్వరూ దానిని బంధించకపోతే ఆయా ప్రాంతాలను ఆ రాజు గెలిచినట్లే. ఎవరైనా అడ్డుకొంటే వారితో ఇతని సైన్యం యుద్ధం చేసేది. అట్టిదానిని ఈ రోజులలో ఎవరూ చేయలేరని భావిస్తారు కదా! మనలో ఎవడైనా చేయగలడా అని ప్రశ్నించడానికి బదులు మనమందరమూ చేయగలమా? అని ప్రశ్నిస్తున్నానని గమనించండి.

సాధ్యాసాధ్యాలను ప్రక్కన పెట్టండి. అసలెందుకు చేయాలి? అది కీర్తి ప్రతిష్ఠలను సాధిస్తుందనా? ఇంద్రలోకం వస్తుందనా, ఇవే ప్రయోజనాలైతే దీనిని చేయనవసరం లేదు. ఆ కీర్తి ప్రతిష్ఠలు, ఇంద్రలోక ప్రాప్తులు – ఇవన్నీ మనలోని అహంకారాన్ని రెచ్చగొట్టేవే. వీటివల్ల పిసరంత జ్ఞానం రాదు. అయితే ఎందుకు?

లలితాత్రిశతి వేదంలో లేకపోయినా దానికి చాలా ప్రశస్తి ఉంది. హయగ్రీవుని నుండి అగస్త్యుడు లలితా సహస్రనామాలను ఉపదేశం పొందాడు. ఉపదేశం పొంది మనశ్శాంతిని పొందాడు. ఈ త్రిశతికి శంకరులు భాష్యం వ్రాసేరు. నామాలు, త్రిశతి – ఈ రెండూ మంత్రతుల్యములే. కనుక వీటిని రక్షించుకోవాలి.

ఈ త్రిశతిలో 'హయమేధ సమర్చితా' అనే నామం వస్తుంది. గుర్రం వంటి ముఖంతో విష్ణు వుండడం వల్ల హయగ్రీవుడయ్యాడు. అశ్వమేధ యాగం చేత ఆమె అర్చింపబడేది కనుక అమ్మవారు హయమేధసమర్చిత అయింది.

మరొక విధంగా చెప్పాలంటే అశ్వమేధం చేస్తే అమ్మవారిని అర్చించినట్లే. భాగ్య భోగ్యాలకు, స్వర్లోక సౌఖ్యానికి యాగాలు చేస్తూ ఉంటారు. ఇంతకంటె చిత్తశుద్ధిని పొందడమే ఫలం. యాగం చేయడం వల్ల చిన్న చిన్న శక్తుల నీయడమే కాదు, అన్ని పురుషార్థాలనూ ప్రసాదిస్తుంది. ఆమె సంతోషపడితే మోక్షసామ్రాజ్యలక్ష్మినీ ప్రసాదిస్తుంది. ఈ మోక్షం అన్ని సుఖాలకు అతీతం. కనుక ఇహ పరలోక సుఖాలనందిస్తుంది. ఎందుకిది చేయాలని ముందు ప్రశ్న వేసాను. సమాధానం దొరికింది కదా!

ఈ త్రిశతి పారాయణంలో చాలా నియమాలున్నాయి. ఇట్టి యజ్ఞ నియమాలు ఈ కాలంలో కుదరని మాట.

అట్లా అని అశ్వమేధయాగం చేయకుండా ఉందామా, కాదు. అందరికీ వీలుపడే ఒక రకమైన అశ్వమేధయాగం, దానిని శాస్త్రం చెప్పింది. ఇతరుల పట్ల దయ చూపించి సేవ చేయగలిగితే అశ్వమేధఫలం వస్తుందని పూర్వులన్నారు.

## ఆశించకుండా సేవించుట

ఇపుడు జీవకారుణ్యమని పరోపకారమనే మాటలను వాడాను కదా. ఆలోచిస్తే ఈ రెండు మాటలూ తప్పే.

ఇతరుల మీద చూపించేది కరుణ కదా! ఇందులో కరుణ చూపించేవాడు ఒక మెట్టు పైన ఉన్నాడు. చూపింపబడేవాడు, క్రింద మెట్టున ఉన్నాడు. ఎప్పుడైతే ఆ భావన వచ్చిందో మనం చూపే కరుణ కళంకితమౌతోంది. కనుక కరుణ చూపించేటపుడు మనలో వినయముండాలి. అహంకారం లేకుండా ఉండాలి. ఆత్మోన్నతికై పాటు పడడానికి బదులు అధమగతిని తీసుకొని వస్తున్నామేమో అని గమనించాలి.

కనుక కరుణకు బదులు ప్రేమ అనే పదాన్ని వాడి చూడండి. ప్రేమలో ఎక్కువ తక్కువలుండవు. జాలిని చూపించేవాడొకడు, చూపింపబడేవాడొకడనే భేదం ఉండదు. అయితే ఈ ప్రేమను చూపించడం అంత తేలిక కాదు.

తిరువళ్ళువర్ ఈ భేదాన్ని గుర్తించాడు. అంబు (ప్రేమ), అరుల్ (దయ) అనే మాటలు వాడాడు. దయ, ప్రేమకు కలిగిన సంతానమన్నాడు.

మనమెవరిని ప్రేమిస్తాం? మనదగ్గరివారిని కదా! ఈ ప్రేమ పరిధిని పెంచి చూడండి. బంధువుల కంటె మొత్తం గ్రామాన్ని, గ్రామం కంటె మొత్తం దేశాన్ని;

దేశం కంటె మొత్తం ప్రపంచాన్ని ప్రేమించగలిగితే ప్రేమనుండే ఈ దయ పుట్టినట్లు అవగతమౌతుంది. దయాస్థానాన్ని ప్రేమ ఆక్రమిస్తుంది. ప్రేమించడం సహజమైపోతుంది. ఆ ప్రేమ ఇక స్వార్థం గురించి కాదు. నిస్స్వార్థమైన ప్రేమగా రూపొందుతుంది.

దయ ఎప్పుడు పుడుతుంది? అందరిలోనూ ఒక ప్రాణశక్తి ఉంది, అందరిలోనూ ఈశ్వరుడున్నాడనినపుడు తన బంధువుల్ని ప్రేమించడానికి బదులు క్రమక్రమంగా అందరూ ఈశ్వర సంతానమని భావించి సేవ చేస్తాడు. వైష్ణవులు నైచ్యం అని వాడుతారు. అనగా తాను తక్కువ వాడనని, ఇతరులు తనకంటె ఎక్కువవారనే భావన కలగడమే నైచ్యానుసంధానం. అపుడు మాటలలో ప్రేమను ఒలకబోయడానికి బదులు చేతలలో చూపించి దయగా రూపొందుతుంది. అపుడు తామధికులమనే భావన పోయి అందరినీ ఈశ్వర రూపాలుగా భావించి ప్రేమగా మారి ఎవర్ని సేవించినా ఈశ్వరుని సేవించినట్లే భావిస్తాడు. దయా పూర్వకమైన క్రియ ఉన్నపుడు పరమేశ్వరానుగ్రహం తనంతట తానే వస్తుంది.

దయ చూపించినపుడు తానొకరి పట్ల దయ చూపిస్తున్నానని, ఎవరికో సాహాయ్యం చేస్తున్నాననే భావనను ఎంతమాత్రం రానీయకుండా ఉంటే అభ్యుదయం. ఆ భావన లేకపోతే అహంకారం ఇంకా పెరుగుతుంది.

ఆ సందర్భంలో జీవకారుణ్యం, పరోపకారం అనే మాటలు పనికిరావని అన్నాను, తాను చేసే సేవ ఇతరులకు ఉపయోగించకపోయినా, పై సంస్కారవంతునికి చిత్తశుద్ధికై ఇది తోడ్పడుతుంది. చిత్తశుద్ధి ఏర్పడితే తనకు తాను ఉపకారం చేసుకొన్నట్లవుతుంది. అనగా అట్టి సేవ స్వయం ఉపకారమే.

అద్వైత భావన కలవానికి అందరూ ఈశ్వర స్వరూపంగానే కన్పిస్తారు కనుక ఉపకారం చేయడం అతని సహజధర్మమే. అయినా అపుడు కూడా పరోపకారం అనకూడదు. ఎందుకంటే తనకంటె భిన్నంగా మరొకటి లేదు కదా! అందుకే అప్పర్‌స్వామి, నా ధర్మం సేవ చేయడమే, దానికి కట్టుబడి యుండడమే అన్నాడు.

సేవాధర్మం ప్రేమతో, ఉత్సాహంతో హృదయపూర్వకంగా ఉండాలి. ఏదో మ్రొక్కుబడిగా కాదు. ప్రపంచంలో ప్రతి ప్రాణి పరస్పరం ఇచ్చి పుచ్చుకొంటోంది. మనం ప్రాణివర్గం నుండే కాదు, అప్రాణి వర్గం నుండి లాభాన్ని పొందుతున్నాం.